క్లుప్తంగా

సంగెం నూతన ఎస్సైగా వంశీకృష్ణ



సంగెం: సంగెం నూతన ఎస్సైగా కె.వంశీకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎల్.నరేష్ మిల్స్ కాలనీకి బదిలీ కాగా టాస్క్‌ఫోర్స్‌లో ఉన్న వంశీకృష్ణ సంగెం ఎస్సైగా వచ్చారు. మంగళవారం రాత్రి ఆయన సంగెం ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



నర్సంపేట రూరల్ : చెన్నారావుపేట మండలంలోని ధర్మతండా మాజీ ఉపసర్పంచ్ భూక్య వీరాసింగ్, యూత్ నాయకులు భూక్య రాజు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బుధవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

క్రీడలతో మానసికోల్లాసం

నర్సంపేట రూరల్ : యువతకు క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బీఆర్‌ఎస్ నాయకుడు పిన్నింటి దేవేందర్‌రెడ్డి అన్నారు. నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామంలో కబడ్డీ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో పాల్గొని గెలుపొందిన విజేతలకు పిన్నింటి దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మిడిమాలపు మధు బుధవారం నగదు బహుమతిని అందించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు భూస రాజు, యూత్ సభ్యులు దార సతీష్, మేడి రంజిత్, కావాటి రాకేష్, టోర్నమెంట్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే ఉపాధి

సంగెం: విద్యార్థులు వృత్తివిద్యా కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకుంటే ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి పొందవచ్చని వృత్తి విద్యా కోఆర్డినేటర్ అనిల్ అన్నారు. మండలంలోని గవిచర్ల మోడల్ స్కూల్ ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు బ్యూటీ, వెల్‌నెస్ కోర్స్‌లో భాగంగా దసరా సెలవుల్లో వరంగల్‌లోని పూజ అకాడమిలో ఇంటర్న్‌షిప్ చేస్తున్నారు. శిక్షణ పొందుతున్న విద్యార్థినులను బుధవారం కలిసిన ఆయన శిక్షణ గురించి తెలుసుకున్నారు. ఇంటర్న్‌షిప్ శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఎస్ఎస్ఏ కోఆర్డినేటర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్లు వేస్తుండగా విద్యుదాఘాతం

- జీపీ మల్టీపర్పస్ వర్కర్ మృతి
- పండుగపూట నర్సానగర్‌లో విషాదం



కుమారస్వామి (ఫైల్)

సంగెం: పండుగ పూట గ్రామంలో వీధిలైట్లు వేసి వెలుగులు నింపాలనుకున్న జీపీ సిబ్బంది ఇంటిలో చీకటి అలుముకుంది. వీధిలైట్లు వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ మృత్యువాత పడిన విషాదఘటన మండలంలోని నర్సానగర్‌లో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్ర కారం నర్సానగర్ జీపీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న ఓదెల కుమారస్వామి (49) గ్రామపరిధిలోని జాటోత్ తండాలో బుధవా రం వీధిలైట్లు వేస్తున్నాడు. లైట్ వేస్తున్న స్తంభం పైన 11కేవీ లైన్, బావులకు వెళ్లే త్రీఫేజ్ ఎల్‌టీ లైన్, వీధి దీపాల లైన్ ఉన్నాయి. ఎల్‌టీలైన్, వీధి దీపాల లైన్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ బంద్ చేసి లైట్ వేస్తున్న క్రమంలో అతడి వద్ద ఉన్న తీగ పైన ఉన్న 11కేవీ లైన్ తాకి విద్యుదాఘాతంతో కిందపడిపోయాడు. తలకు తీవ్రమైన గాయమైంది. ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కుమారస్వామి మృతి చెందాడు. మృతుడికి భార్య రమ, కుమారుడు రామకృష్ణ, కూతురు గీతాంజలి ఉన్నారు.

అన్‌స్కిల్డ్ వర్కర్లతో స్కిల్డ్ పని..

గ్రామపంచాయతీల్లో గతంలో కారోబార్, వాటర్‌మెన్, ఎలక్ట్రీషియన్, స్వీపర్ ఇలా ఉండేవారు. ప్రస్తుతం అందరినీ మల్టీపర్పస్ వర్కర్లుగా పరిగణించడంతోపాటు అన్‌స్కిల్డ్ (నైపుణ్యం లేని) వారితో ఎలక్ట్రీషియన్, ట్రాక్టర్ డ్రైవర్ వంటి స్కిల్డ్ పనులు సైతం చేయిస్తున్నారు. కుమారస్వామి అంతగా నైపుణ్యం లేనివాడు కావడంతో వీధిదీపాల పనులు చేయడం వల్లనే విద్యుదాఘాతానికి గురై చనిపోయాడని, ప్రభుత్వం గతంలో మాదిరిగా నైపుణ్యం కలిగిన వారితో పనులు చేయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడో..?

- మాధన్నపేట వాగుపై ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- వర్షాలు పడితే రాకపోకలు బంద్



నర్సంపేట- నల్లబెల్లి ప్రధాన రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న మాధన్నపేట వాగు (ఫైల్)

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని అతిపెద్ద చెరువు మాధన్నపేట చెరువు. మాధన్నపేట చెరువు మత్తడి పోస్తే చాలు నర్సంపేట- నల్లబెల్లి ప్రధాన రహదారిపై రాకపోకలు బంద్ అవుతాయి. ఈ వరద తాకిడికి లో లెవల్ బ్రిడ్జి సైతం ప్రమాదకరంగా మారింది. గతంలో వద్ద వరద ఉధృతికి రోడ్డుసైతం కొట్టుకుపోయింది. దీంతో అధికారులు తాత్కాలికంగా ఏర్పాట్లు చేశారు. కానీ, శాశ్వతంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నర్సంపేట మండలంలోని మాధన్నపేట చెరువు నిజాం కాలంలో అక్కన్నమాధన్నలు నిర్మించినట్లుగా చెబుతారు. ఈచెరువు నర్సంపేట పట్టణానికి కూతవేటు దూరంలోనే ఉంటుంది. 17 ఫీట్ల లోతుతో ఈ చెరువులో నీరు నిల్వ ఉంటుంది. నల్లబెల్లి మండలంలోని రంగాయచెరువు నిండితే ఆ నీరంతా మాధన్నపేట చెరువులో చేరుతుంది. మాధన్నపేట చెరువు మత్తడి పోస్తుండడంతో నర్సంపేట- నల్లబెల్లి ప్రధాన రహదారి జలమయమై రాకపోకలు బంద్ అవుతాయి. దీంతో నాగుర్లపల్లి, మాధన్నపేట, భాంజీపేట, బోజ్యానాయక్ తండా చంద్రయ్యపల్లి, కమ్మపల్లి, దాసరిపల్లి, పర్శ నాయక్ తండా తదితర గ్రామాల ప్రజలు నర్సంపేటకు రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అయితే పర్శనాయక్‌తండా మీదుగా మహేశ్వరం గ్రామానికి, తిమ్మంపేట మీదుగా లక్నేపల్లి గ్రామానికి వెళ్లి నర్సంపేట రావాల్సి వస్తుండడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మాధన్నపేట వాగుపై హై లెవల్ వంతెనను నిర్మించి శాశ్వత పరిష్కారం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



నర్సంపేటలో మాట్లాడుతున్న బాలకృష్ణ



సంగెం: అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

నర్సంపేట రూరల్ : ఎన్నికల నియమ నిబంధనలను ప్రతీ ఒక్కరు తప్పకుండా పాటించాలని మండల స్పెషలాఫీసర్ బాలకృష్ణ అన్నారు. చెన్నారావుపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎన్నికలపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లను వెంటనే తొలగించాలన్నారు. శిలాఫలకాలు, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించితే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్ అబీద్ అలీ, ఎంపీడీఓ నల్ల శ్రీవాణి, ఎస్సై రాజేష్‌రెడ్డి, పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంగెం: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఎంపీడీఓ కాసర్ల రవీందర్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలనాధికారులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఇన్‌చార్జ్‌గా తహసీల్దార్ రాజ్‌కుమార్ వ్యవహరిస్తారని తెలిపారు. నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఒక పోలీస్ అధికారి, వీడియోగ్రాఫర్‌తో కలిసి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పర్యటిస్తుందన్నారు. గ్రామాల్లోని ఫ్లెక్సీలు, వాల్‌రైటింగ్, కటౌట్‌ల తొలగింపు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన తదితరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఏఎస్సై లక్ష్మి పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన పాలకులు

- ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

నర్సంపేట: పాలక పక్షాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంసీపీఐ(యూ) డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి అధ్యక్షతన ఓంకార్ భవన్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి వచ్చే వామపక్ష సామాజిక అభ్యుదయ శక్తులతో కలిసి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, జిల్లా వ్యాప్తంగా అవకాశం ఉన్న ప్రతి చోట పోటీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థలు సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో సమస్యలు పెరిగిపోయాని అన్నారు. గ్రామాల్లో ప్రజలు, ఓటర్లు డబ్బు, మద్యానికి లొంగకుండా చిత్తశుద్ధితో మంచినాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజాసాహెబ్ మాట్లాడుతూ గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కన్నం వెంకన్న, నాగెల్లి కొమురయ్య, ఎల్లబోయిన రాజు, గాజుల వెంకటయ్య, మహ్మద్ అల్లి సాబ్, బుడిమే సురేందర్, బత్తిని కుమారస్వామి, కర్నె సాంబయ్య, జన్ను రమేష్ పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమం సామాజిక బాధ్యత



వేడుకల్లో పాల్గొన్న వయోవృద్ధులు



మొక్క నాటుతున్న సీనియర్ సిటిజన్స్

నర్సంపేట: వృద్ధుల సంక్షేమాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని షీ టీం ఎస్సై స్వాతి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో వయోవృద్ధుల సంఘం అధ్యక్షుడు నల్ల మనోహర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు ఎ.జగన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వృద్ధులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా పరిష్కరించడానికి అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో కూచన భద్రయ్య, జిల్లా బాధ్యులు యుగెందర్, సీనియర్ సిటిజన్ ఆర్థిక కార్యదర్శి లక్ష్మణ్‌బాబు, వడ్లకొండ సాంబయ్య, కోదాటి వీరస్వామి, భూపాల్‌రెడ్డి, సుధాకర్, కార్యవర్గ సభ్యులు లింగయ్య, ఈశ్వరమూర్తి పాల్గొన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్స్‌ను శాలువాతో సన్మానించారు. అలాగే గౌరవ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా భోజన వితరణ, కేక్ కటింగ్ వీరస్వామి భాగస్వామ్యంతో చేశారు.

మొక్కలు నాటిన సీనియర్ సిటిజన్స్

నర్సంపేట రూరల్ : అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా చెన్నారావుపేట మండల సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో వైకుంఠధామంలో బుధవారం మొక్కలు నాటారు. సంఘం అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్య కవి, మల్లయ్య, నారాయణరెడ్డి, కృష్ణమూర్తి, సత్తయ్య, కట్టయ్య పాల్గొన్నారు.

కురుమలు ఐక్యంగా ఉండాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న కురుమలు

నర్సంపేట: నియోజకవర్గంలోని కురుమ కులస్తులంతా ఐక్యంగా ఉండాలని బీరప్ప కురుమ కుల సంఘం అధ్యక్షుడు బుడిగొండ భిక్షపతి పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని వరంగల్ రోడ్డు అమరవీరుల స్థూపం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు బుధవారం బీరప్ప కురుమ కుల సంఘం తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఒగ్గు కళాకారుల ప్రదర్శనతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని గ్రీన్ రిసార్ట్‌లో సంఘం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ డివిజన్‌లో అత్యధిక శాతం ఉన్న కురుమలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కురుమలంతా ఐకమత్యంతో ముందుకు సాగాలని, మన హక్కులు సాధించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కెంచ కుమారస్వామి, కాట్ల భద్రయ్య, కోరె సుధాకర్, కంకల పృథ్వీ, కంచు ప్రభాకర్, చీర అశోక్, బాల్‌రాజ్, కోరె కుమారస్వామి, చీర అశోక్, దయ్యాల బాలరాజ్, దయ్యాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు పెద్దపీట



పార్టీ కండువా కప్పుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట/దుగ్గొండి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత ఇచ్చి ప్రజాప్రతినిధులను చేస్తానని భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు దుగ్గొండి మండలం రాజ్యతండా, గోబ్రాతండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు, నెక్కొండ మండలం చెరువుముందు తండా గ్రామానికి చెందిన పలువురు యువకులు బుధవారం బీజేపీలో చేరారు. వారికి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. రాజగోపాల్, ఎడ్ల సతీష్, అన్నబోయిన రాజు, బానోతు రమేష్‌నాయక్, వీరభద్రునాయక్ పాల్గొన్నారు.

బీమాతో వాహన డ్రైవర్లకు ధీమా

- టీపీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి



బీమా పత్రాలు అందజేస్తున్న రంజిత్‌రెడ్డి

నెక్కొండ: నిత్యం ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసే ఆటో డ్రైవర్లకు ప్రమాదబీమా వారి కుంటుబాలకు ధీమానిస్తుందని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి అన్నారు. గతంలో నవత ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా ఇచ్చిన మాటకు కట్టుబడి సొంత ఖర్చులతో ప్రమాద బీమా పాలసీ పత్రాలను మండల కేంద్రంలో బుధవారం రంజిత్ రెడ్డి 160 మంది డ్రైవర్లకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.5 లక్షల పరిమితితో బీమా కల్పించామన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. డ్రైవర్లు ఆర్టీఓ నిబంధనలను తప్పకుండా పాటించాలని ఆయన సూచించారు. ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరవేయడంలో ఆటో డ్రైవర్ల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు మోడెం సురేశ్, డ్రైవర్లు శ్రీరం శ్రీనివాస్, ప్రభాకర్, పెండ్యాల రాజు, భద్రూనాయక్, మోడెం రాజు, మహ్మద్ అమీర్, తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు ఘనంగా పూజలు



నర్సంపేట: పూజలో పాల్గొన్న భక్తులు



దుగ్గొండి: గిర్నిబావిలో..



ఖానాపురం: పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నర్సంపేట: నర్సంపేట పట్టణంలోని దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారిని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే జనతా యూత్ క్లబ్ ఆధ్వర్యంలో, శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి సందీప్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పంబి వంశీకృష్ణ, పట్టణ కార్యదర్శి చిప్ప నాగ, తదితరులు పాల్గొన్నారు.

మహిషాసుర మర్దిని అవతారంలో దుర్గాదేవి

దుగ్గొండి: మండలంలోని పలు గ్రామాల్లో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. 10వ రోజు కార్యక్రమంలో భాగంగా దుర్గాదేవి మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. గిర్నిబావిలోని బీరప్ప ఆలయంలో దుర్గాదేవిని ఎంపీడీఓ లెక్కల అరుంధతి, పంచాయతీ కార్యదర్శి నూనె వేణు దర్శించుకుని పూజలు చేశారు.

కొనసాగుతున్న పూజలు

ఖానాపురం: మండల వ్యాప్తంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధరావుపేట, ఖానాపురం, అశోక్‌నగర్, రంగాపురంతో పాటు ఇతర గ్రామాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధల నడుమ పూజలు చేపట్టారు. బుధరావుపేటలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో హోమపూజలు నిర్వహించారు.

మండల కేంద్రంలో..

పర్వతగిరి: పర్వతగిరి మండల కేంద్రంలోని శ్రీవేణు గోపాలస్వామి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా గోలి సోమిరెడ్డి అరుణ దంపతులు, గోలి మధుకర్‌రెడ్డిస్రవంతి, మల్లాడి సబితజ్ఞానేందర్‌రెడ్డి, సముద్రాల సాంబయ్య కుమార్తె అచ్చ నికితకార్తీక్‌లు పూజలో పాల్గొనగా అర్చకులు ఎం.ఫణికుమార్ శర్మ, బొల్లోజు హర్షవర్ధనాచార్యులు ఛండీ హోమం నిర్వహించారు.

దుర్గామాత వద్ద అన్నదానం

సంగెం: దేవి నవరాత్రులను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల వద్ద భక్తులు నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం మండలంలోని గవిచర్లలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత వద్ద మహాఅన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులతో పాటుగా పంచాయతీ కార్యదర్శి శరత్, మాజీ సర్పంచ్ దొనికెల రమాశ్రీనివాస్, నాయకులు నాగరాజు, దేవరాజ్, మాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పర్వతగిరి: హోమం నిర్వహిస్తున్న భక్తులు



సంగెం మండలం గవిచర్లలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

గంజాయితో పట్టుబడ్డ యువకులు



యువకుల అరెస్ట్‌ను చూపుతున్న పోలీసులు

రాయపర్తి: గంజాయితో యువకులు పట్టుబడ్డ సంఘటన మండలకేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కన్పించడంతో స్థానికుల సమాచారం మేరకు ఎస్సై రాజేందర్ యువకులను అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో వారి వద్ద ఉన్న 185 గ్రాముల గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. యువకుల్లో ఇద్దరు రాయపర్తి మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందినవారిగి గుర్తించినట్లు తెలిపారు. కేశవాపురం గ్రామానికి చెందిన చిలుముల భరత్, జోగు కార్తిక్, రాపోలు రమేష్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. జఫర్‌గఢ్ మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన జానీ తప్పించుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో వాటర్‌మెన్ మృతి

పర్వతగిరి: మండలంలోని వడ్లకొండ గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ వాటర్‌మెన్, ఎలక్ట్రీషియన్ వడ్డే కుమారస్వామి బుధవారం అనారోగ్యంతో ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారస్వామి మృతిపై గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న మనోజ్‌గౌడ్

పర్వతగిరి: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన బాల్లె రాములు బుధవారం మృతి చెందాడు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ మనోజ్‌గౌడ్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొత్తూరి రామ్మోహన్, మాజీ ఉపసర్పంచ్ బొమ్మెర లింగమూర్తి, జనగాం రాములు, బల్లె కాంతయ్య, బల్లె వెంకట్రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

నర్సంపేట రూరల్ : చెన్నారావుపేట మండలంలోని లింగగిరి గ్రామానికి చెందిన పొన్నం రాములు ఇటీవల మృతిచెందగా.. కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యదర్శి మాదారపు చరణ్ 50 కిలోల బియ్యం అందించగా, గ్రామ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో రూ.10,400 ఆర్థిక సాయం బాధిత కుటుంబానికి బుధవారం అందించారు. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు మంద సోమయ్య, నాయకులు చీకటి చిన్న రాజు, కుక్కల కుమార్, తాడేం ప్రభాకర్, సాగర్, పైండ్ల వెంకన్న, భూపాల్‌ప్రసాద్, బూడిద వెంకన్న, పుసునూరి ప్రణయ్, మాదరపు ఎనోష్, మంద అఖిల్, కుక్కల రాజు, ముదురు కోళ్ల యాకన్న, కూరపాటి సంపత్, ఆకుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెప్రకృతి వనంలో చెట్ల నరికివేత

ఖానాపురం: మండలంలోని గొల్లగూడెంతండా పల్లెప్రకృతి వనంలో బుధవారం చెట్లు నరికారు. పంచాయతీ కార్యదర్శి రవి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గమ్మ గుడి సమీపంలో గతంలో పల్లెప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. ప్రకృతి వనంలో చెట్లు ఏపుగా పెరిగిన చెట్లను గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు నరికివేశారు. చెట్లను నరకొద్దని పంచాయతీ కార్యదర్శి అడ్డుపడినా వినిపించుకోకుండా దుర్గమ్మగుడికి అడ్డుగా ఉన్నాయని చెబుతూ నరికివేసినట్లు స్థానికులు తెలిపారు. ఇదే విషయంపై ఎంపీడీఓ సునీల్‌కుమార్‌ను వివరణ కోరగా చెట్ల నరికివేత తమ దృష్టికి వచ్చిందని, పోలీసులకు ఫిర్యాదు చేయించడంతోపాటు చట్టప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ రూరల్ :
9951602875 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. రాజు యాదవ్ (S.R) : 9502950309 (వర్ధన్నపేట)
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944